క్లుప్తంగా

ఘనంగా మన్యసూక్త హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం మన్యసూక్త హోమం ఘనంగా జరిగింది. నరఘోష, శత్రుఘోష, రుణబాధ నివారణ, గ్రహశాంతి, కార్యసిద్ధి కోసం ఈ హోమం నిర్వహిస్తున్నారు. రూ.516 రుసుం చెల్లించిన వారు హోమంలో పాల్గొన్నట్టు ఆలయ ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. భక్తులకు ప్రసాదం అందజేశారు.

రూ.98 లక్షలతో కల్యాణ మండప నిర్మాణం



34వ వార్డులో నిర్మిస్తున్న కల్యాణ మండపం

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డులో రూ.98 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ఆరోగ్య కేంద్రం వద్ద కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. రెండో ఫ్లోర్ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కార్పొరేటర్ తోట పద్మావతి తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొనడంతో ఒక వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. వన్ టౌన్‌లోని కొబ్బరితోటకు చెందిన బి.కుమార్‌స్వామి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 25న అతడు పని నిమిత్తం వెళ్లాడు. తిరిగి 26న ఉదయం 5 గంటలకు జ్ఞానాపురం బ్రిడ్జి మీద నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా.. పైడితల్లి అమ్మవారి గుడివద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో అతడి ఎడమకాలికి గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు కుమార్‌స్వామిని చికిత్స కోసం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి.సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్య రూపకంలో విద్యార్థులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సోమవారం సాయంత్రం అల్లిపురం నవ్య డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకం వీక్షకులను ఆకట్టుకుంది. గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి శరగడం మోహన్‌రావు, ఇతర కార్యవర్గ సభ్యులు వారిని అభినందించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గురుద్వారాలో గురునానక్ జయంత్యుత్సవం

సీతమ్మధార: సిక్కు మత స్థాపకుడు, మొదటి గురువు గురునానక్ దేవ్ జీ జయంత్యుత్సవం సందర్భంగా సోమవారం గురుద్వారా మందిరంలో ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు గురుద్వారా అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్ స్వాగతం పలికారు. ప్రతినిధులతో కలిసి మందిరంలో ఆయన ప్రార్థనలు చేశారు. మత పెద్దలు 24 గంటల సంకీర్తనలు నిర్వహించారు.



నాడు: కల్లుపాకలు ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్ర భవనం



నేడు: కల్లుపాకలులో కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం



ప్రసాద్ గార్డెన్స్ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు



పండా వీధి అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం తింటున్న చిన్నారులు

అంగన్‌వాడీ.. నూతన ఒరవడి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. కనీస సదుపాయాలకు నోచుకోని స్థితి నుంచి.. నేడు అద్భుతంగా అవి రూపాంతరం చెందాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మరింత నాణ్యమైన ఆహారంతోపాటు చిన్నారుల సమగ్రాభివృద్ధికి పునాది వేసేలా నూతన విద్యా విధానంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చి చక్కగా తీర్చిదిద్దారు. పిల్లల సమగ్రాభివృద్ధికి, జీవితంలో నిలదొక్కుకోడానికి అవసరమైన పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తోంది. ఈ క్రమంలో 3 నుంచి 6 ఏళ్ల వయసు గల చిన్నారులను అన్ని విధాలుగా తీర్చిదిద్ది ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్య పేరిట అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు, టీచింగ్ మెటీరియల్‌ను సంసిద్ధత మేళాల ద్వారా అందజేశారు.

- అందంగా రూపుదిద్దుకుంటున్న ప్రీ స్కూళ్లు
- ప్రభుత్వ నిధులతో కొత్త భవనాల నిర్మాణం, సకల సౌకర్యాల కల్పన
- పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య, పోషకాహారం
- సీఎం జగన్ పాలనపై లబ్ధిదారుల హర్షం

జగదాంబ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు పెద్దపీట వేశారు. కొత్త భవనాల నిర్మాణం, పాత వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. అంగన్‌వాడీ సెంటర్లను మోడ్రన్ ప్రీ స్కూల్‌గా తీర్చిదిద్దడమే కాకుండా పిల్లలకు ఇచ్చే భోజనం మెనులో అనేక మార్పులు చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నెలకు 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలుతోపాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందిస్తూ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. పుట్టే బిడ్డ రక్తహీనతతో బాధపడకుండా ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఆకాంక్షతో డ్రై రేషన్ అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పిల్లల భవితకు వరంలా మారిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

35వ వార్డులో అంగన్‌వాడీల స్వరూపం

జీవీఎంసీ 35వ వార్డులో మొత్తం 8 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కల్లుపాకలు ప్రాంతంలో 2, పండా వీధిలో 1, ప్రసాద్ గార్డెన్స్‌లో 2, వెలంపేటలో 1, మేదర వీధిలో 1, పువ్వుల వీధిలో 1 చొప్పున ప్రీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో సుమారు 200 మంది చిన్నారులు, 150 మంది గర్భిణులు, 120 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ గతంలో భోజనాలు వండి పెట్టేవారు. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటికే రేషన్ అందజేస్తున్నారు. ఇప్పటికీ 7 నెలల నుంచి రెండేళ్లలోపు పిల్లలకు రెండున్నర కేజీల బాలామృతం పిండి, నెలకు 25 గుడ్లు, రెండున్న లీటర్లు పాలు అందిస్తున్నారు.



ఇది కదా అభివృద్ధి

వార్డు నంబర్	35
• మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	8
• చదువుతున్న చిన్నారుల సంఖ్య	200
• బాలింతల సంఖ్య	120
• గర్భిణుల సంఖ్య	150
• ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లల సంఖ్య	400
• కల్లుపాకలు ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన వ్యయం	రూ.20 లక్షలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ మెనూ

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు. 100 గ్రాముల పాలు, ఉడికించిన ఒక గుడ్డు, సోమవారం ఆనపకాయ, పప్పు, మంగళవారం పులిహోర, సాంబారు, బుధవారం అన్నం, ఆకుకూర పప్పు, గురువారం అన్నం, ఆకుకూర, శుక్రవారం సాంబారు, అన్నం, శనివారం బిర్యాని, పప్పు అందజేస్తున్నారు.

టేక్ హోం రేషన్ మొదటి విడత

బాలింతలు, గర్భిణులకు ఇంటికి 15 రోజులకు ఒకసారి 1 నుంచి 5వ తేదీలోపు వైఎస్సార్ కిట్, బ్యాగ్‌తోపాటు రెండు కేజీల రాగి పిండి, కేజీ అటుకులు, బెల్లం పావుకేజీ, బెల్లం చెక్కీలు పావుకేజీ, ఖర్జూరం పావుకేజీ, మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ ఆయిల్, 13 గుడ్లు, రెండున్నర లీటర్లు పాలు అందజేస్తున్నారు.

రెండో విడత

నెలలో 16 నుంచి 30 తేదీ వరకు 12 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తున్నారు.



గర్భిణికి పౌష్టికాహార ప్లస్ కిట్ అందిస్తున్న పండా వీధి అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త

ప్రభుత్వ సేవలు బాగున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు బాగున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తిరిగి వచ్చే రోజులు పోయాయి. ఇంటి వద్దకే సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేయడం బాగుంది.

– ధనలక్ష్మి, బాలింత, కల్లుపాకలు

కిట్ సరకులు పెరిగాయి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్ ద్వారా అందించే సరకులు పెరిగాయి. గతంలో భోజనం పెట్టి పంపించేవారు. ఇప్పుడు నెలంతటికి రెండున్నర లీటర్ల పాలు, 25 గుడ్లతోపాటు ఆరు రకాలు పోషకాహార సరుకులు అందిస్తున్నారు.

– వరి సన్యాసమ్మ, గర్భిణి, ప్రసాద్ గార్డెన్స్

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు



నెలలు నిండి ఉండే మాకు టేక్ హోం ద్వారా ఇంటికే సంపూర్ణ పోషణ కిట్లు వస్తున్నాయి. డ్రై రేషన్ వల్ల రక్తహీనత బారి నుంచి కాపాడుకోవచ్చు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం.

– జగ్గా భవాని, బాలింత, పండా వీధి

శంభో శంకర



శివరామకృష్ణ దేవస్థానంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



విశేష అలంకరణలో ఉమా చంద్రమౌళేశ్వరస్వామి

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

అల్లిపురం: కార్తీక మాస రెండో సోమవారం, కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివయ్యను దర్శించుకునేందుకు బారులు తీరారు. అస్సాం గార్డెన్స్ శ్రీశివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి, పౌడరా రోడ్డులోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో, మురళీధర వీధి పంచముఖేశ్వరస్వామి దేవాలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంచముఖేశ్వరుడికి భక్తులు స్వయంగా పంచామృతాలతో అభిషేకించారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో నిర్వహించిన ఆకాశ దీప పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారికి అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

కాలుష్య రహిత విశాఖకు సహకరించండి



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖలో కాలుష్యం నియంత్రణకు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి ప్రజలకు పిలుపునిచ్చారు. నగర కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తన చాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా నగర ప్రజలు తమ వంతు బాధ్యతగా ప్రజా రవాణాన్ని ఉపయోగించాలని, కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ ఇప్పటికే ఎన్నో చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా ప్రతి సోమవారం ఉద్యోగులతోపాటు అధికారులు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు సహకరించాలని ఆమె కోరారు.

ఏడుగురు రోగులకు ఆర్థిక సాయం



పంకజ కుమార్‌శర్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



మంచాన పట్టిన మహిళకు నగదు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: ప్రజా దర్బార్‌లో వైద్య సహాయం కోసం వచ్చిన అర్జీలపై ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పందించారు. తన సొంత నిధుల నుంచి ఏడుగురికి రూ.50 వేలు అందజేశారు. ఆదర్శనగర్‌లో నివసిస్తున్న బెహరా మున్నా ఇటీవల టౌన్‌కొత్తరోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు అతడి భార్య అర్జీ పెట్టుకోవడంతో.. ఎమ్మెల్యే కేజీహెచ్ వెళ్లి పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. 30వ వార్డు ఏనుగుల వీధికి చెందిన దెండి రాజీవ్ గాంధీ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పెద్దకర్మ కోసం రూ.5 వేలు, 34వ వార్డు మనోరమ థియేటర్ వద్ద నివసిస్తున్న పంకజకుమార్‌శర్మ(మార్వాడీ) పక్షవాతంతో మంచాన పట్టడంతో రూ.5 వేలు, కొబ్బరితోటకు చెందిన సూరాడ లక్ష్మి పక్షవాతంతో బాధపడుతున్న దృష్ట్యా మందుల కొనుగోలుకు రూ.5 వేలు, 31వ వార్డు కృష్ణా గార్డెన్స్‌కు చెందిన గృహసారథి తండ్రి నరం వెంకటరమణారావు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దృష్ట్యా రూ.5 వేలు, 31వ వార్డు గొల్లలపాలేనికి చెందిన వలంటీర్ సోదరి పెనుమత్స లావణ్య కడుపులో కేన్సర్‌తో బాధపడుతున్న దృష్ట్యా రూ.5 వేలు, చెస్ట్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న భానుస్ట్రీట్‌కు చెందిన దాసరి నీలవేణికి రూ.5 వేల చొప్పున అందజేసి తన గొప్ప మనసు చాటుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలు వార్డుల అధ్యక్షులు, జేసీఎస్ ప్రెసిడెంట్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో హేత్విక్ కార్తికేయ సత్తా



కార్తికేయను అభినందిస్తున్న కోచ్ నూకరాజు

దాబాగార్డెన్స్: కరాటే పోటీలో సత్తా చాటిన హేత్విక్ కార్తికేయను పలువురు అభినందించారు. పోర్టు స్టేడియంలో మూడు రోజులుగా జరిగిన కరాటే పోటీల్లో నగరానికి చెందిన హేత్విక్ కార్తికేయ ఎనిమిదేళ్ల కేటగిరీలో రెండు విభాగాల్లో పోటీపడి రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. కుమిటే విభాగంలో, కాట విభాగంలో ఈ పతకాలు గెలుపొందాడు. సోమవారం కార్తికేయను కోచ్ నూకరాజు, స్కూల్ యాజమాన్యం అభినందించారు.

సత్యదేవునికి భక్త నీరాజనం



స్వామి దర్శనానికి క్యూల్లో బారులుదీరిన భక్తులు



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయం కిక్కిరిసింది. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. గోవింద నామాలు స్మరిస్తూ దేవదేవుడిని దర్శించుకున్నారు. వేకువజామున 4 గంటలకు ధ్వజస్తంభ పూజ జరిగింది. రూ.300 చెల్లించిన భక్తులతో తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 9 గంటల వరకు గంట గంటకు సామూహిక వ్రతాలు జరిపించారు. రూ.1,116 చెల్లించిన భక్తులచే అనివెట్టి మండపంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. మంచి నీటి సౌకర్యం కల్పించింది. ఉచిత ప్రసాదం పంపిణీ చేసింది. భక్తుల తాకిడి దృష్ట్యా ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు ఎవరికి అనుమతి కల్పించలేదని ఈవో బుద్ధ మహాలక్ష్మి గణేష్ తెలిపారు. పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

పెండింగ్ కేసులపై ఏసీపీ ఆరా



పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌ఐను అడుగుతున్న ఈస్ట్ ఏసీపీ మూర్తి

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం రెండో రోజు ఈస్ట్ ఏసీపీ డి.ఎస్.ఆర్.వి ఎస్.ఎన్.మూర్తి సందర్శించారు. పాత కేసులతోపాటు ఇతర కేసులపై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని ఎస్‌ఐలు వెంకటరావు, ప్రమీలకు ఏసీపీ సూచించారు. రౌడీషీటర్లకు సంబంధించి వారి యాక్టివిటీస్, మిస్సింగ్ కేసుల గురించి సీఐ ఎస్.విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సీడీ ఫైల్స్‌పై ప్రత్యేక ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఏసీపీ మూర్తి మాట్లాడుతూ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు జీవనోపాధిపై శిక్షణ



శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న పీడీ పాపునాయుడు

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పట్టణ సమాఖ్య పరిధిలోని స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు సుస్థిర జీవనోపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి యూనిట్లు అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారని జీవీఎంసీ పథక సంచాలకుడు(యూసీడీ) కేవీ పాపునాయుడు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు కేఎల్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన సంఘ మహిళలకు పాపునాయుడు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. స్వయం సహాయక సంఘం మహిళల్లో ఒక్కొక్కరు చొప్పున ఆసక్తి గల వారికి నైపుణ్యాభివృద్ధి, వ్యాపారాభివృద్ధిపై ఈ నెల 20 నుంచి 23 వరకు శిక్షణ ఇచ్చారన్నారు. ఏడుగురికి కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ వర్క్స్, ఐదుగురికి పేపర్ ప్లేట్స్ తయారీ, నలుగురికి క్లాత్, జ్యూట్ బ్యాగ్ తయారీ, స్క్రీన్ ప్రింటింగ్, ఒకరికి ఆర్టిఫిషియల్ జూవెల్లరీ తయారీలో శిక్షణ అందించారన్నారు. వీరికి శిక్షణతోపాటు వ్యాపారాభివృద్ధికి కనీస వడ్డీకే రుణం మంజూరు చేస్తామని, యూనిట్ నిర్వహణ సమయంలో రాయితీ కూడా అందజేస్తామన్నారు.